ప్రజాశక్తి
సోమవారం 3 జూన్ 2024
5
శ్రీ సత్యసాయి



పెద్దపప్పూరు ఎస్ఐ సస్పెన్షన్ ..?

ప్రజాశక్తి - పెద్దపప్పూరు

పెద్దపప్పూరు ఎస్ఐ శరత్‌చంద్రను సస్పెండ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. తాడిపత్రి స్వతంత్ర అభ్యర్థి సోమేశ్వర నాయుడు పెద్దపప్పూరు మండలంలో తలదాచుకోగా అతని ఆచూకీ కనుగొనక పోవటంలో విఫలమైనందుకు ఎస్ఐపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిసింది. తాడిపత్రి స్వతంత్ర అభ్యర్థి సోమేశ్వరనాయుడు నియోజవర్గ బహిష్కరణకు గురికాగా ఆయనను తాడపత్రి పట్టణంలో పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఇన్ని రోజులు ఆయన పెద్దపప్పూరు మండలంలో తలదాచుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. సోమేశ్వరనాయుడు పెద్దపప్పూరు మండలంలో తలదాచుకున్న సమాచారం తెలుసుకోవటంలో ఆ మండల ఎస్ఐ విఫలమయ్యారని ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు ఆయనను సస్పెండ్ చేసినట్లు సమాచారం.



బొమ్మనహాల్ మండలంలో నీటమునిగిన పత్తిపంట



విడపనకల్లు మండలంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

'అనంత'లో గాలివాన బీభత్సం

నేలకొరిగిన చెట్లు, విద్యుత్‌స్తంభాలు నీటి మునిగిన పంట పొలాలు



కొత్తచెరువు మండలంలో రోడ్డుపై విరిగిపడిన చెట్టు

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం జిల్లాలో శనివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పలుమండలాల్లో చెట్లు, విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. పంటలు నీట మునిగాయి. అనంతపురం జిల్లాలోని బొమ్మనహాల్, ఉరవకొండ, బెళుగుప్ప, విడపకల్లు తదితర మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. శ్రీసత్యసాయి జిల్లాలో కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల్లో వర్షం కురిసింది. శనివారం రాత్రి వచ్చిన గాలివానకు పలుచోట్ల నష్టం వాటిల్లింది.

బొమ్మనహాల్ : శనివారం రాత్రి బొమ్మనహాల్‌లో కురిసిన వర్షానికి 22.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. పలుగ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలు నీటమునిగియా. మండలంలోని, ఎలంజి, కులగానహళ్లి, శ్రీధర్ గట్ట గ్రామాల్లో రైతులు సాగుచేసిన పత్తి, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలు నీటమునిగాయి. భారీ వర్షానికి వేదవతి నది పరుగులు తీసింది. పంట పొలాలపై వరద నీరు రావడంతో కోతకొచ్చిన పత్తి పంట నీట మునిగి అపార నష్టం వాటిల్లిందని బాధితరైతులు వాపోతున్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి పంటనష్టాన్ని అంచనా వేసి తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఉరవకొండ : ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం రాత్రి ఉరుములు,మెరుపులతో కూడిన భారీ వర్షానికి 52.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు, గాజుల మల్లాపురం, హావలిగి, పొలికి తదితర గ్రామాలలో భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు,చెట్లు కూడా నేలకొరిగాయి.

కొత్తచెరువు : శనివారం రాత్రి మండలంలో కురిసిన వర్షానికి 42.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షంతో పాటు గాలి వీచడంతో చెట్లు, విద్యుత్‌స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. లోచర్ల చెరువు వద్ద చింత చెట్టు విరిగి పడడంతో పెనుగొండ - కొత్తచెరువు రహదారిలో రాకపోకలు స్తంభించిపోయాయి. అలాగే మరుకుంటపల్లి వద్ద రోడ్డు మీద చెట్లు పడడంతో తలమర్లకు వెళ్లే రహదారి స్తంభించిపోయింది అలాగే పెనుగొండ రోడ్డులో రైల్వే బ్రిడ్జి కింద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొత్తచెరువులో విద్యుత్తు తీగలపై కొబ్బరి చెట్టు పడడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

పుట్టపర్తి అర్బన్ : శ్రీసత్యసాయి జిల్లాలోని 32 మండలాలకు గాను ముదిగుబ్బ మండలం మినహా అన్ని మండలాల్లో శనివారం రాత్రి ఒక మోస్తారు వర్షం కురిసింది. రెవిన్యూ గణంకాల లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 632.4 వర్షపాతం నమోదయింది. అత్యధికంగా కనగానపల్లిలో 54.2 మిల్లీమీటర్లు, చిలమత్తూరు మండలంలో 51.2 మిల్లీమీటర్లు, ఎన్‌పి కుంటలో 44.2, కొత్తచెరువు మండలంలో 42.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. తలుపులలో అత్యల్పంగా 2.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మిగతా మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. మంచి అదనులో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం వల్ల దాదాపు జిల్లా అంతటా ఖరీఫ్ సీజన్ లో సాగుకు భూములను దుక్కి దున్నేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఈ ఏడాది బాగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో బీడు భూములు, పంటలతో పచ్చగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

రేపే ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పూర్తి





అనంతపురంలో జెఎన్‌టియులో కౌంటింగ్ ఏర్పాట్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కౌంటింగుకు కౌంట్‌డౌన్ మొదలైంది. మరికొన్ని గంటల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. గడిచిన 20 రోజులుగా ఓట్ల ఫలితాల కోసం సాగుతున్న నిరీక్షణకు తెరపడనుంది. ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లను ఇప్పటికే అధికార యంత్రాగం పూర్తి చేసింది. అనంతపురం జిల్లాకు సంబంధించి అనంతపురం జెఎన్‌టియులోనూ ఓట్ల లెక్కింపు జరుగుతుండగా సత్యసాయి జిల్లాకు సంబంధించి హిందూపురం లేపాక్షిల్లో ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలున్నాయి. వీటికి మే 13న పోలింగ్ జరిగింది. మంగళవారం నాడు ఆయా ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరగనుంది.

పూర్తి అయిన ఏర్పాట్లు : అనంతపురం, సత్యసాయి జిల్లాలో రెండింటిలోనూ ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు సర్వం సిద్ధమయ్యాయి. సత్యసాయి జిల్లా పరిధిలో 11,92,287 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఓట్ల లెక్కింపునకు 750 మంది సిబ్బందిని నియమించారు. అనంతపురం జిల్లా పరిధిలో ఎనిమిది అసెంబ్లీ, అనంతపురం పార్లమెంటు నియోజకవర్గముంది. ఇక్కడ 16,36,315 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఓట్ల లెక్కింపునకు 954 మంది సిబ్బందిని నియమించారు. ఆయా పోలింగు కేంద్రాల్లోనూ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రంలోపు ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టామని అధికార యంత్రాంగం చెబుతోంది.

కట్టుదిట్టమైన భద్రత : ఓట్ల లెక్కింపు సమయంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లను పోలీసులు చేపట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో పెట్టారు. ఎన్నికల సమయంలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని అనంతపురం జిల్లా ఎస్పీ గౌతమి శాలి వెల్లడించారు. అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టినట్టు తెలిపారు. ఈ సమయంలో ప్రత్యేకంగా 274 ప్రాంతాల్లో కొత్తగా సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఫలితాల సమయంలో ఎక్కడ ఎటువంటి ఘటనలు చోటు చేసుకున్నా అణచివేయడానికి పోలీసు బలగాలతో పాటు కేంద్ర బలగాలు వచ్చాయి. ముందస్తు అనుమతులున్న వారినే పోలింగు కేంద్ర పరిసరాల్లోకి అనుమతిస్తారు. ఫలితాల అనంతరం ప్రదర్శనలను కూడా నిషేధించారు.



బిట్ కళాశాల కౌంటింగ్ కేంద్రంలో అధికారులకు సూచనలిస్తున్న సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 4 నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు అన్బుకుమార్, దీపక్ రామ్ చంద్ర తివారిలు పేర్కొన్నారు. ఆదివారం బిట్ కళాశాలలోని హిందూపురం, కదిరి, పెనుకొండ, మడకశిర అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణ కార్యక్రమంలో అబ్జర్వర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, కదిరి ఆర్‌ఒ వంశీకృష్ణ, మడకశిర గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ అన్బుకుమార్ మాట్లాడుతు కౌంటింగ్ సిబ్బంది అప్రమత్తంగా తమకు కేటాయించిన విధులను నిర్వర్తించాలని సూచించారు. పెనుగొండ నియోజకవర్గం సంబంధించిన జనరల్ అబ్జర్వర్ దీపక్ రామ్ చంద్ర తివారి కౌంటింగ్ మాట్లాడుతూ సూక్ష్మ పరిశీలకులకు ప్రతీ రౌండ్ కీలకమని అన్నారు. ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని, ఎక్కడా పొరపాట్లు దొర్లకూడదని సూచించారు. అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్లను ఏజెంట్లకు చూపించాలని, వారినుంచి సంతకాలు తీసుకోవాలని చెప్పారు. కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ జూన్ 4న ఉదయం 6 గంటలకే ఆయా కౌంటింగ్ కేంద్రాలకు కచ్చితంగా చేరుకోవాలన్నారు. అభ్యర్థులు వారి ఏజెంట్లు కూడా కౌంటింగ్ సిబ్బందికి అన్ని విధాల సహకరించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు కచ్చితంగా ఐడి కార్డులతో హాజరుకావాలని కౌంటింగ్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అంతకు మునుపు లేపాక్షి లోని గురుకుల పాఠశాలలో పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌంటింగ్ అబ్జర్వర్లు, ధర్మవరం ఆర్‌ఒ వెంకట శివ సాయి రెడ్డి, పుట్టపర్తి ఆర్‌ఒ భాగ్య రేఖ, జిల్లాలోని ఆయా నియోజకవర్గాల సహాయ ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అందరి చూపు హిందూపురం వైపు..!

♦బాలయ్య హ్యాట్రిక్ సాధించేరా..? ♦పెద్దిరెడ్డి పాచికలు పారేనా..? ♦రేపు ఉత్కంఠకు తెర..




ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలోనే హిందూపురం నియోజక వర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. నాటి ఎన్టీఆర్ నుంచి నేటి బాలయ్య వరకు టిడిపికి ఓటమి ఎరుగని కోట ఏదైనా ఉంది అంటే అది హిందూపురం అని ప్రతి ఒక్కరు చెబుతారు. ఓటమి ఎరుగని కోటలో ఈ సారి ఏలాగైనా వైసిపి జెండా ఎగురవేయాలని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. అయితే వెలువడిన ఎగ్జిట్ పోల్స్ సర్వేలన్నీ బాలయ్య వైపు చూపించాయి. దీనిని బట్టి చూస్తే బాలయ్య హ్యాట్రిక్ దిశగా దూసుకు పోతున్నారని ఆపార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలోనే ప్రత్యేక అసెంబ్లీ నియోజకవర్గమైన హిందూపురంలో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో అందరి దృష్టి హిందూపురంపై పడుతోంది. వచ్చే మే నెలలో ఎన్నికలు జరిగినప్పటి నుంచి కౌంటింగ్ వరకు ప్రతి ఒక్కరు హిందూపురం వైపు చూస్తున్నారు. ఎన్నికలకు ముందు నుంచే మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి హిందూపురంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీని కోసం బలమైన మైనార్టీ నాయకుడు విశ్రాంత ఐపిఎస్ అధికారిని సైతం ఇక్కడి నుంచి ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తప్పించి, మంత్రికి అనుకూలమైన వ్యక్తి అయిన వేణురెడ్డి భార్య దీపికను ఇన్‌ఛార్జిగా నియమించడంతో పాటు బిసిలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెరపైకి తెచ్చారు. దీంతో పాటు అన్ని వర్గాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. అందరు కలిసి ఎన్నికల సమయంలో పని చేశారు. అయితే అప్పటికే షేక్ మహమ్మద్ ఇక్బాల్ తన ఎమ్మెల్సీ పదవితో పాటు పార్టీకి రాజీనామా చేయడంతో పాటు వైసిపి మైనార్టీలను మోసం చేసిందని హిందూపురంతో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేశారు. బాలకృష్ణ, దీపిక ప్రచారాలకు నియోజక వర్గంలో అందరు బ్రహ్మరథం పట్టారు. దీంతో పాటు రెండు పార్టీల వారు ఓటుకు నోట్లు సైతం భారీగానే పంచారు. అయితే అధికార వైసిపిలో కొంత మంది కౌన్సిలర్లు వార్డుల్లో డబ్బులను పంపిణీ చేయకుండా నొక్కేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో పట్టణంలో వైసిపికి ఓట్ల శాతం తగ్గి టిడిపికి పెరిగినట్లు తెలుస్తోంది. ఇక లేపాక్షి మండలంలో సైతం టిడిపికే అధికంగా ఓట్లు పడినట్లు తెలుస్తోంది. చిలమత్తూరు మండలంలో అధికార వైసిపికి టిడిపి కన్నా ఎక్కువగా ఓట్లు వచ్చినట్లు వార్తలు వినపిస్తున్నాయి. దీనిని బట్టి చూస్తే బాలయ్య హ్యాట్రిక్ సాధించడం ఖాయం అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదే జరిగితే కంచుకోటపై వైసిపి జెండా ఎగర వేయాలన్న పెద్దిరెడ్డి ఆశలు ఆవిరి అయినట్లే. ఏది ఎమైనప్పటికి ఎవరిని విజయం వరిస్తుందో మంగళవారం బిట్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లో నిక్షిప్తమైన ఈవిఎం లెక్కింపులో తేలనుంది.

'పురం'లో పారిశుధ్యం అస్తవ్యస్తం

◆విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు..! ◆పెరుగుతున్న టైఫాయిడ్, మలేరియా కేసులు
◆కిట కిటలాడుతున్న ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులు ◆డ్రయినేజీలు మారిన నీటి పారుదల శాఖ కాలువలు



ముక్కడిపేటలోని మురుగు కాలువలో పేరుకు పోయిన చెత్త

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి జిల్లా వాసులను సీజనల్ వ్యాధులు వణికిస్తున్నాయి. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా అంతటా జ్వరాలు విజంభిస్తున్నాయి. గత రెండేళ్లలో కంటే ప్రస్తుత సీజన్‌లో రోగుల సంఖ్య అధికంగానే ఉండే ప్రమాదం ఏర్పడింది. ఎన్నికల సాకుతో అధికారులు పారిశుధ్యాన్ని పట్టించుకోలేదు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఎక్కడ చూసినా మురుగు కాలువలు నిండి రోడ్డుపైకి నీరు ప్రవహిస్తోంది. ఫలితంగా దోమల ఉధృతి పెరిగింది. దీంతో మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో పాటు అక్కడక్కడ డయేరియా కేసులు కూడా నమోదవుతున్నాయి.

ప్రధానంగా హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా అధికారుల లెక్కల ప్రకారం 4700 ఖాళీ జాగా స్థలాలు ఉన్నాయి. అయితే వీటి సంఖ్య ఇంకా ఎక్కుగానే ఉంటాయని అంటున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు ఈ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. ఆ చెట్ల కింద పందులు ఆవసాలను ఏర్పాటు చేసుకుని అపరిశుభ్రం చేయడంతో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో పాటు నీటి పారుదల శాఖకు చెందిన కాలువలను పురపాలక సంఘం వారు మురుగు కాలువలుగా మార్చుకున్నారు. ఆ కాలువలను శుభ్రం చేయక పోవడంతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. వీటిపై గ్రామ, వార్డు శానిటేషన్ సెక్రెటరీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆ స్థలాలను శుభ్రం చేయించడంతో పాటు, కాలువలు నిండి రోడ్డుపైకి నీళ్లు రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటే కాస్తా కట్టడి చేయాడానికి అవకాశాలు ఉంది. అయితే ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కేవలం స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ హిందూపురం అనే నినాదాలకు మాత్రమే పరిమితమయ్యారన్న విమర్శలు వినపడుతున్నాయి.

దోమల ఉత్పత్తి కేంద్రాలుగా డ్రెయినేజీలు, ఖాళీ స్థలాలు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పారిశుధ్యం మరింత అధ్వానంగా మారింది. దీంతో పాటు ఖాళీ స్థలాలను ఎవరు పట్టించుకోక పోవడం వల్ల ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. పట్టణాల్లో పారిశుధ్యంపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండగా.. పల్లెల్లో నిధుల లేమితో పాలకులు పట్టించుకోవడంలేదు. దీంతో దోమలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయి రాత్రుళ్లే కాదు పగలు కూడా ప్రజలపై దాడి చేస్తున్నాయి. అపరిశుభ్రత, దుర్వాసన, దోమలతో ప్రజలు వ్యాధులు అల్లాడి పోతున్నారు. ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులు కాని, పాలకులుకాని పట్టించుకోకపోవడం వల్లే ప్రజలకు ఈ ఇబ్బందులు అనిపలువురు అభిప్రాయపడుతున్నారు. దోమల నివారణకు చేపట్టాల్సిన కనీస చర్యలపై కూడా అధికారుల్లో స్పందన లేకపోవడం దారుణమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కనిపించని నియంత్రణ చర్యలు

మున్సిపాలిటీలు, పంచాయతీలు వర్షాకాలం ప్రారంభంలో ముందుస్తుగా అనేక చర్యలు తీసుకోవాలి. పారిశుధ్యం, వరద నీటి పారుదలపై ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలి. అయితే అటు అధికారులు కాని, ఇటు పాలకవర్గాలుకాని ఈ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. దీంతో ప్రజలు విషజ్వరాలు, ఇతర అంటువ్యాధులతో అల్లాడిపోతున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాల ద్వారా పొగ కొట్టాలి. వర్షాకాలం వస్తుందనగానే ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతులు చేసి సిద్ధం చేసుకోవాలి. వీధుల్లో, డ్రెయిన్లలో చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలి. చెత్త, మురుగు నిల్వ ఉండే ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లాలి. మురుగు నీటి కాల్వలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో బైటెక్స్, ఎబేట్, మలాథియాన్ ద్రావణాలు చల్లాలి. తద్వారా దోమలను అడ్డుకోవచ్చు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో గంబూషియా చేపలను వదిలాలి. మురుగు కాల్వల్లో తరచూ ఆయిల్ బాల్స్ వదలాలి. మడ్డి ఆయిల్ చల్లుతూ ఉండాలి. డ్రెయిన్లలో పూడికలు తొలగించి మురుగు నీటి పారుదల వ్యవస్థను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. అయితే ఇలాంటి చర్యలు చేపట్టక పోవడంతోనే ప్రజలు సీజనల్ వ్యాధులతో భాదపడుతున్నారు.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం

జిల్లా ఆస్పత్రికి వచ్చే జ్వరపీడితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. ఎక్కువగా అనుమానిత డెంగీతో పాటు టైఫాయిడ్ కేసులు వస్తున్నాయి. జ్వర బాధితులకు తొలుత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, ఆ తరువాత చికిత్స అందిస్తున్నాం. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సాధారణ జ్వరమైనా ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలి. నిర్లక్ష్యంగా ఉంటే వ్యాధి వ్యాప్తి పెరిగే అవకాశం ఉంది. వెంటనే వైద్య సేవలు పొందాలి.

డాక్టర్ ఆఫ్తాబ్,
చిన్నపిల్లల వైద్య నిపుణులు

రేపు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం


22 రోజుల ఉత్కంఠకు తెర.. గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

ప్రజాశక్తి-కదిరి అర్బన్

రాష్ట్రంలో 2024 సార్వత్రిక ఎన్నికలు మే 13వ తేదీ జరిగిన విషయం తెలిసిందే. పోలింగ్ జరిగి జూన్ 4వ తేదీ నాటికి ఎన్నికలు 22 రోజులు పూర్తవుతుంది. అప్పటి నుంచి అభ్యర్థుల తలరాతలు ఈవీఎంలలో నిక్షిప్తమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 4వ తేదీ ఓట్లు లెక్కించనున్నారు. ఎవరికి వారు లోలోపల ఆందోళనకు గురవుతున్నా పైకి మాత్రం గెలుపు తమదంటే తమదే అని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. ఇక కదిరి నియోజకవర్గంలో కూటమి (బిజెపి, టిడిపి, జనసేనపార్టీలు) అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మక్బూల్ అహ్మద్ మధ్యే ప్రధానంగా పోటీ ఉంది. అయితే పలు సర్వేల ఫలితాలు కందికుంటకు అనుకూలంగా వచ్చాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో యువత, ఉద్యోగులు టిడిపి అనుకూలంగా ఓట్లు వేసినట్లు తెలుస్తోంది. ఇటీవల పలు సర్వే సంస్థలు ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్‌లో రాష్ట్రంలో కూటమిదే అధికారం అని చెప్పాయి. పట్టణాల్లో అత్యధికంగా ఓటు శాతం పెరిగినట్లు టిడిపి లెక్కలు వేసుకుంటుంది. ఏదేమైనా ఒక్క రోజు వేచి చూస్తే అభ్యర్థుల తలరాతలు బయటపడతాయి. ఇకన కదిరి నియోజకవర్గం విషయానికొస్తే చాలా ఎగ్జిట్ పోల్స్‌లో కందికుంట వెంకటప్రసాద్ గెలవడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రకటించాయి. రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టడం, కదిరిలో కందికుంట వెంకటప్రసాద్ గెలుపు ఖాయమని తెలుగుతమ్ముళ్లు ఆనందంలో ఉన్నారు.

బెట్టింగ్ జూదరుల్లో ఉత్కంఠ

జూన్ 4వ తేదీ(మంగళవారం) సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి. అయితే ఈ ఫలితాలు ఎవరి కొంప కొల్లేరు చేస్తాయే అనే ఆందోళన పందెం కాసిన వారిని ముంచెత్తుతోంది. గెలుపోటములు, మెజారిటీ, అధికారం తదిర అంశాల్లో కోట్లాది రూపాయలు పందెం వేసినట్లు బహిరంగంగానే చెప్పుకుంటున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న విమర్శలు కూడా జోరందుకున్నాయి. పందెం కాస్తున్నట్లు ఎలాంటి రుజువులు లభ్యం కావడంలేదనేది ఖాకీల వాదన. కదిరి నియోజకవర్గంలో అభ్యర్థి గెలుపుపై కొందరు రెండు రోజుల క్రితం లక్షలాది రూపాయలు పందెం వేసి రాసుకున్న ఒప్పందం పత్రం ఒకటి సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఆ ఒప్పందం పత్రం బయటికి రావడంతో వైసిపి ముఖ్య నాయకుల్లో మరింత ఆందోళన పెరిగిందని కూడా చెప్పుకుంటున్నాను. సొంత పార్టీ నాయకులే ప్రతిపక్ష పార్టీ గెలుస్తుందని పందెం కట్టడం ఏంటని వారు ప్రశ్నించుకుంటున్నారు. ఓ మండలానికి చెందిన వైసిపి నాయకులు ప్రతిపక్ష పార్టీ, కూటమి విజయం దక్కించుకుంటుందని కోటి రూపాయలు పందెం వేసినట్లు విశ్వసనీయ సమాచారం. జూన్ 4వ తేదీ పందెం కాసిన వారి పరిస్థితి ఏంటని, ఎవరి కొంప కొల్లేరు అవుతుందో నని వారి



సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న పందెం ఒప్పంద పత్రం

కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు టీ కొట్టుల వద్ద చర్చించుకుంటున్నారు. ఏదేమేనా జూన్ 4వ తేదీ గెలుపు ఎవరి తలుపు తడుతుందో వేచి చూడాలి. బరిలో నిలిచిన అభ్యర్థుల టెన్షన్ ఏమాత్రమో తెలియదు కానీ, లక్షలాది రూపాయలు పందెం వేసిన వారి పరిస్థితి మాత్రం అయోమయంగా ఉన్నట్లు తెలుస్తోంది.



కుమార్తె నమితనాయుడు జన్మదినం సందర్భంగా అన్నదానం చేస్తున్న డి.నాగరాజు, లీలావతమ్మ దంపతులు

అయ్యప్ప ఆలయం వద్ద అన్నదానం

సోమందేపల్లి : పెనుకొండ పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఆదివారం భగవాన్ శ్రీసత్యసాయిబాబా ఆశీస్సులతో నారాయణ సేవలో భాగంగా సంతకు వచ్చిన గ్రామీణ ప్రజలు, పేదలు, యాచకులు 200 మందికి స్వీట్లు, అన్నదానం చేశారు. న్యాయవాది డి.నాగరాజు, లీలావతమ్మ దంపతుల కుమార్తె నమితనాయుడు జన్మదినం సందర్భంగా వారు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీసత్య సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపుపై నేడు సమావేశం

పుట్టపర్తి రూరల్ : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుపై సోమవారం(నేడు) పుట్టపర్తి ఆర్‌డిఒ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థులు, ఏజెంట్లకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పుట్టపర్తి ఆర్‌డిఒ భాగ్యరేఖ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు అంశంపై అభ్యర్థులు, ఏజెంట్లకు పలు సూచనలు చేయనున్నట్లు ఆమె తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు ఆర్‌డిఒ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నామని అందరూ హాజరుకావాలని కోరారు. నియోజకవర్గంలోని అభ్యర్థులు, జనరల్ ఏజెంట్లు, తహశీల్దార్లు సమావేశానికి హాజరుకావాలని కోరారు.



పెనుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆత్మీయ సమావేశమైన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-సోమందేపల్లి

పెనుకొండ పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ 2001-04 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా ఒకరినొకరు యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అలాగే అప్పటి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ఘనంగా సన్మానించి వారి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. జయప్ప, పూర్వ అధ్యాపకులు డా.శంకరయ్య, డా. సీతారామయ్యశాస్త్రి, డా. హరీష్ బాబు, డి.రామన్న, డా. అశ్వర్థప్ప, డా. నాగరాజు, అధ్యాపకేతర సిబ్బంది శంకర, నాగరాజు, నబిరసూల్ పాల్గొన్నారు.



ఒడిసిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారు ముందుగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసు కుంటూ రోజంతా ఎంతో ఉత్సాహంగా సంతోషంగా గడిపారు. కార్యక్రమం నిర్వహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 19 ఏళ్ల తర్వాత అందరినీ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. తమ గురువులు చల్లటి దీవెనలతో తాము నేడు ఈ స్థాయిలో ఉన్నామని తెలిపారు. వారి గురువులు జయ చంద్రారెడ్డి, భాగ్యలక్ష్మి, రామచంద్రరెడ్డి, సుబ్బిరెడ్డి, జయరాజ్, బాబాఫకృద్దీన్, కృష్ణారెడ్డి, అంజనప్ప, ఫకృద్దీన్, బాబు పాల్గొని పూర్వ విద్యార్థులను ఉద్దేశించి సందేశం ఇచ్చారు. ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు వారి గురువులను పూలమాలలు, శాలువాల తో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రవి, బాబావలి, సల్మా, కళ్యాణి, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981-82 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మదనపల్లి సమీపం లోని హార్స్‌లీ హిల్స్ వద్ద ఆత్మీయ సమావేశమైనట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలలో 2012లో ఓ సారి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించామని, ఇప్పుడు మరోమారు సమావేశమయ్యామన్నారు. వారు ఒకరినొకరు యోగ క్షేమాలు తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ రోజంతా ఎంతో సంతోషంగా ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమాదేవి, అరుణమ్మ, చంద్రమ్మ, జి.జగన్నాథం, కె.చంద్రశేఖర్‌రెడ్డి, బి.శేఖర్‌రెడ్డి, అత్తార్ అన్వర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



హార్స్‌లీ హిల్స్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ చర్యలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సన్నద్ధంగా ఉన్నామని అందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. ఆదివారం ఎన్నికల కౌంటింగ్‌పై ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ కౌంటింగ్‌కు పూర్తిస్థాయి ఏర్పాట్లకు సన్నద్ధంగా ఉండాలని ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు కౌంటింగ్ జరగాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రాలలో సెల్‌ఫోన్లను అనుమతించవద్దని రౌండ్ల వారీగా ఖచ్చితమైన ఫలితాలను నిర్దేశించిన ఫార్ములాలో నివేదికలను

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్ బాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఆన్‌లైన్‌లో ఎన్నికల కమిషన్‌కు పంపాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలలో అగ్ని ప్రమాదాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ ఏర్పాట్లు చేశామని ప్రతి కౌంటింగ్ హాలులో 24 టేబుళ్లు ఏర్పాటు చేశామని వివరించారు. సోమవారం మధ్యాహ్నం లోపు కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, కౌంటింగ్ కేంద్రం వద్ద 200 మీటర్ల వరకు రెడ్‌జోన్ ప్రకటించామని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని కలెక్టర్ సీఈవోకు వివరించారు.

కౌంటింగ్ ప్రాంతాల్లో నాలుగంచెల భద్రత

ప్రశాంత వాతావరణంలో లెక్కింపు నిర్వహణే లక్ష్యం : జిల్లా ఎస్పీ మాధవరెడ్డి



ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద పెద్దఎత్తున పోలీసులు బలగాలని మోహరించి నాలుగంచెల భద్రత నిర్వహించి ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. కేంద్ర సాయుధ బలగాలు, రాష్ట్ర బలగాలు రంగంలోకి దిగాయని, నిరంతరం డ్రోన్, సీసీ కెమెరాలతో నిఘా ఉంచామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించేందుకు ఇద్దరు ఎస్పీలు, ముగ్గురు ఎఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 42 మంది సిఐలు, 68 మంది ఎస్ఐలు, 326 మంది ఎఎస్ఐలు, 500 మంది పోలీసులు, 300 మంది హోంగార్డులు, 60మంది మహిళా పోలీసులతో పాటు 120 మంది ఎఆర్ కానిస్టేబుళ్లు, 80 మంది ఏపీఎస్పీ పోలీసులతో పాటు జిల్లా వ్యాప్తంగా 110(క్యూఆర్‌టి టీములు) కేంద్ర సాయుధ బలగాలు, గ్రేహౌండ్స్ బలగాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అంతేకాక నిరంతరం డ్రోన్, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందన్నారు. కౌంటింగ్ జరిగే ప్రాంతాల్లో పటిష్ట భద్రతతో పాటు ఆయా ప్రాంతాల్లో లోపల, వెలుపల ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, బందోబస్తు ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టామన్నారు. లేపాక్షి గురుకుల పాఠశాల, బిట్స్ కళాశాలలోకి వెళ్లొచ్చేందుకు ఎంట్రీ, ఎగ్జిట్ మినహాయించి మార్గాలేవీ లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఎన్నికల నియమా వళి అమలులో ఉన్నందున జిల్లా వ్యాప్తంగా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా 144 సెక్షన్ ఆంక్షలు విధించామని, 30 పోలీస్ యాక్టు అమలులో ఉందన్నారు. ఎక్కడా గుంపులుగా ఉండకూడదని, కౌంటింగ్ అనంతరం 6వ తేదీ సాయంత్రం వరకూ ఎన్నికల నియమావళి వర్తిస్తుందని విజయోత్స ర్యాలీలకు అనుమతులు లేవన్నారు. ముందస్తు అనుమతి లేనిదే ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, సభలు నిర్వహించరాదన్నారు. బాణసంచా పేల్చడం నిషేధం అన్నారు. ఏ చిన్న సంఘటన జరిగినా సీసీ కెమెరాలో నిక్షిప్తమై ఉంటాయని, తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తప్పవన్నారు. నిరంతరం డ్రోన్, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని, పోలీస్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ నుంచి సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎవరైనా అల్లర్లు, గొడవలు సృష్టిస్తే తక్షణమే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంటుందన్నారు. కీలకమైన కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం ఉందనికళాజ్యోతి కమిటీ అధ్యక్షులు నారాయణ, కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని కళాజ్యోతిలో ఏప్రిల్ 25 నుంచి జూన్ 2వ తేదీ వరకూ (35 రోజులు) జరిగిన ఉచిత టేబుల్ టెన్నిస్, చదరంగం(చెస్), క్యూబ్ సాల్వింగ్ వేసవి శిక్షణ తరగతులు దిగ్విజయంగా ముగిశాయి. ఈ సందర్భంగా టేబుల్ టెన్నిస్ శిక్షకుడు నాగేంద్ర, చదరంగం శిక్షకుడు శివకృష్ణ, క్యూబ్ సాల్వింగ్ శిక్షకుడు కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఏటా కళా జ్యోతి నిర్వాహకుల సహాయ సహకారాలతో ఇటు వంటి క్రీడా కార్యక్రమం నిర్వహించడం హర్షనీయ మన్నారు. ముఖ్యంగా కళాజ్యోతిలో టేబుల్ టెన్నిస్, చదరంగం, క్యూబ్ సాల్వింగ్ అంశాల్లో పూర్తిగా ఉచిత శిక్షణ ఇచ్చామని తెలిపారు. టేబుల్ టెన్నిస్‌లో 60 మంది, చదరంగంలో 200 మంది,



శిక్షణ శిబిరంలో సాధించిన బహుమతులతో విద్యార్థులు

క్యూబ్ సాల్వింగ్ శిక్షణలో 60 మంది పాల్గొన్నారని తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత మూడు క్రీడల్లో ఫిడే క్వాలిఫైడ్ ఆర్బిటర్ ఆదిరత్నకుమార్, శివకృష్ణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి నియమ నిబంధనల ప్రకారం పోటీలు నిర్వహించారు. అండర్-9, 11, 13, 15 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతి విభాగంలో బాలురు, బాలికలకు వేర్వేరుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. అలాగే పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కళాజ్యోతి కమిటీ అధ్యక్షులు నారాయణ, కార్యదర్శి రామకృష్ణ శిక్షకులను అభినందించారు. అనంతరం క్రీడలు నిర్వహించేందుకు కళాజ్యోతి కమిటీ వారు అవకాశం ఇచ్చినందుకు శివకృష్ణ, నాగేంద్ర, కిషోర్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ చదరంగం క్రీడాకారులు శింగనమల రామకృష్ణ, పిడి.రమేష్, జగ్గా వేణుగోపాల్, టేబుల్ టెన్నిస్, చదరంగం, క్యూబ్ సాల్వింగ్ శిక్షార్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిది

జిల్లా అంధత్వ నివారణ రిటైర్డ్ అధికారి డాక్టర్ నరసింహులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అమృత మూర్తులు అమ్మ, నాన్నలు అని, తల్లిదండ్రుల రుణంను ఏ బిడ్డ కూడా తీర్చుకోలేడని జిల్లా అంధత్వ నివారణ రిటైర్డ్ అధికారి డాక్టర్ నరసింహులు పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం ఆయన ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవం గురించి పలు విషయాలు తెలిపారు. ఈ లోకంలో నీవు ద్వేషించినా కూడా నిన్ను ప్రేమించే వారు కేవలం తల్లిదండ్రులేనని, జన్మనిచ్చిన తల్లిదండ్రుల రుణం, ఏమిచ్చినా తీర్చుకోలేమని తెలిపారు. తల్లిదండ్రులు తమ బిడ్డలకు క్రమశిక్షణతో కూడిన పోషణ ఇస్తూ, మంచి హోదాలో ఉండేలా తమకున్న దానిలో ప్రేమను పంచుతారని తెలిపారు. తల్లిదండ్రులకు ప్రేమ పంచితే చాలు, వారు ఏమీ ఆశించరు. అమృతం లాంటి ప్రేమను చూపేది, ఆప్యాయతను రాగాలను పంచేది అమ్మానాన్నలే అని తెలిపారు. బిడ్డల కోసం ఆరాటపడుతూ, కష్టాలను కూడా ఇష్టంగా భరిస్తూ, మన కోసం జీవితాన్ని అంకితం చేసేది కేవలం తల్లిదండ్రులేనని తెలిపారు. జీవితంలో ఏది కోల్పోయినా తిరిగి పొందవచ్చు కానీ, తల్లిదండ్రులను కోల్పోతే మనం తిరిగి పొందలేమని తెలిపారు. ఎటువంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులను దూరం చేసుకోరాదని, అనాథాశ్రమంలో చేర్చారాదని తెలిపారు. ఒకవేళ అనాథాశ్రమాలకు పంపితే, తల్లిదండ్రుల ప్రేమానురాగాలు ఆ కుటుంబానికి పూర్తిగా దూరమవుతాయని తెలిపారు. బ్రహ్మ జీవం పోస్తే, తల్లిదండ్రులు జీవితం ఇస్తారని తెలిపారు. తల్లిదండ్రులు లేకుంటే బిడ్డలకు ఉనికి లేదని, ఎవరికైనా ఉపకారం చేస్తే ముందుగా తల్లికి చేయండి, మర్యాద ఇవ్వాలంటే ముందుగా తండ్రికి ఇవ్వాలన్నారు. బిడ్డల ఆనందమే తమ ఆనందంగా భావించే తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయత, అనురాగాలకు వెలకట్టలేమని తెలిపారు. అంతేకాకుండా జీవితంలో ఎన్నడూ మరిచిపోకూడని వారు అమ్మానాన్నలే అని తెలిపారు. తల్లిదండ్రులు, అన్నాచెల్లెళ్లు, అన్నా తమ్ముళ్లతో కలిసి ఉండే కుటుంబం దేవుడు ఇచ్చిన వరం లాగా ప్రతి ఒక్కరూ భావించాలని తెలిపారు.

నాణ్యతకు భరోసా.. 'ఎంజి సిల్వర్ జ్యువెలరీస్'

ప్రజాశక్తి-అనంతపురం

నాణ్యతతోపాటు నమ్మకంగా కస్టమర్లకు పూర్తిస్థాయి స్వచ్ఛతతో కూడిన 92.5 సిల్వర్ ఆర్నమెంట్స్ ఎంజీ సిల్వర్ జ్యువెలరీ అందిస్తోందని సంస్థ ప్రొప్రైటర్ బి.మంజుల తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ సుదీర్ఘంగా బంగారు, వెండి ఆభరణాల అమ్మకాల్లో ఉన్న నైపుణ్యంతో ఇటీవల ఆర్ఎస్ రోడ్డులోని పెట్రోల్ బంకు పక్కన ఎంజి సిల్వర్ జ్యువెలరీని ప్రారంభించినట్లు తెలిపారు. తమ వద్ద మగువలు నచ్చే మెచ్చే రీతిలో సిల్వర్ ఆర్నమెంట్స్ అన్ని రకాల సంప్రదాయ వెండి ఆవరణాలు, ముఖ్యంగా వివిధ రకాల బిట్స్ లభిస్తాయని తెలిపారు. అలాగే పూజకు అవసరమైన వెండి సామగ్రి, గృహోపకరణ వెండి సామాగ్రి లభిస్తుందన్నారు. ముఖ్యంగా నేటి యువతకు నచ్చే విధంగా అనేక మోడల్స్ వెండితో తయారు చేసిన ఆభరణాలతోపాటు బంగారు పూతతో తయారు చేసిన వెండి ఆభరణాలు ప్రత్యేకంగా తమ వద్ద లభిస్తాయన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

పోలీసులకు బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని మారెమ్మ కనుమ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు యజమానిపై కేసు నమోదు చేయాలని పెడపల్లి గ్రామానికి చెందిన రియల్టర్ శ్రీనివాసనాయక్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన చెల్లెలు రమ్యకృష్ణ, ఆమె భర్త దేవేంద్రనాయక్ ద్విచక్ర వాహనంపై పెడపల్లి గ్రామానికి వస్తుండగా గోరంట్ల వైపు నుంచి ఎదురుగా వచ్చిన కారు బలంగా ఢీకొనడంతో వారు తీవ్రంగా గాయపడ్డారన్నారు. వెనుకనే వస్తున్న తాము గమనించి హుటాహుటిన పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం కిమ్స్ సవేరా ఆసుపత్రికి తరలించామన్నారు. వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు. రోడ్డు ప్రమాదానికి కారకులైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్‌నాయక్ పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మద్యం దుకాణాల వద్ద రద్దీ

కొనుగోలు చేసేందుకు ఎగబడిన మందుబాబులు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 4వ తేదీ ఓట్ల లెక్కింపు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు 3, 4, 5 తేదీల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మద్యం దుకాణాలను బంద్ చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆదివారం మందుబాబులు మద్యం దుకాణాల వద్ద బారులు తీరారు. మూడు రోజులు మద్యం దుకాణాలు బంద్ కావడంతో ఎక్కడ చూసినా మూడు రోజులకు సరి పడే మద్యం కొనుగోలు చేసేందుకు మందుబాబులు ఎగబడ్డారు. దీంతో కొన్ని దుకాణాల వద్ద తోపులాటలు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మద్యం దుకాణాల వద్ద మందుబాబులు పెద్దఎత్తున బారులు తీరారు. మరికొందరు మూడు రోజులు మద్యం లేకుండా ఎలా ఉండాలి అంటూ చర్చించుకుంటున్నారు. ఏదేమైనా ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాతే మద్యం దుకాణాలు తెరవనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎగ్జిట్ పోల్స్ ఫలితాలతో చిగురించిన ఆశలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎపి ఎన్నికల ఫలితాలపై ఎగ్జిట్ పోల్స్ వెల్లడించిన వివరాలతో టిడిపి, వైసిపి నాయకుల్లో ఆశలు చిగురించాయి. పట్టణంలో ఆదివారం ఎక్కడ చూసినా ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై ఇరు పార్టీల నాయకులు చర్చల్లో మునిగిపోయారు. టీ కేఫ్‌లలో గంటల తరబడి చర్చించుకుంటూ కనిపించారు. మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కూటమికి అనుకూలంగా వచ్చాయి. దీంతో బెట్టింగ్ జూదరులు పుట్టపర్తి ఫలితంపై, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే పార్టీపై, ఎన్ని సీట్లు వస్తాయన్న అంశాలపై బెట్టింగ్ జోరును మరింత పెంచారు. మరో 48 గంటలకు ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఇరు పార్టీల్లోనూ ఉత్కంఠ నెలకొంది. మరికొందరు ఈ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను కొట్టివేస్తున్నారు. ఈ ఫలితాలను ప్రామాణికంగా తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. అసలైన ప్రజాతీర్పు ఈ నెల 4వ తేదీ వెల్లడవుతుందని అంటున్నారు.



జగన్మోహన్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి దంపతులు

ఎమ్మెల్యే దంపతుల నివాళి

ప్రజాశక్తి-కొత్తచెరువురూరల్

పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి అంత్యక్రియలు ఆదివారం నారేపల్లిలో నిర్వహించారు. అంతకు ముందు పుట్టపర్తి ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి, ఆయన సతీమణి అపర్ణరెడ్డి నారేపల్లి వెళ్లి జగన్మోహన్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలువురు వైసిపి నాయకులు ఆయనకు నివాళులర్పించారు. అనంతరం ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య నల్లమాడ మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ కృష్ణవేణి, తల్లి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అంత్యక్రియల్లో హుడా ఛైర్మన్ లక్ష్మీనరసమ్మ, ఎంపిపిలు గాయత్రి రెడ్డప్పరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రమణారెడ్డి, జడ్పిటిసి గంగాదేవిశంకర్, మేజర్ పంచాయతీ సర్పంచి రాధా నాగరాజు, నారేపల్లి సర్పంచి ప్రకాష్, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, వాల్మీకి శంకర్, నాగభూషణ్, దాల్‌మిల్లు సూరి, రఘునాథరెడ్డి, నరసింహారెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు లోపు పాఠ్యపుస్తకాల పంపిణీ

రెండు పాఠశాలలకు సీబీఎస్ఈ సిలబస్ : ఎంఈవో గోపాల్ నాయక్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

నెలాఖరు లోపు అన్ని తరగతుల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను తప్పక అందజేస్తామనిఎంఈఓ గోపాల్‌నాయక్ స్పష్టం చేశారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో ఈ నెల 12వ తేదీ పాఠశాలలు పునః ప్రారంభమవుతాయన్నారు. 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకూ వచ్చిన 21 వేల పాఠ్య పుస్తకాలను ఇప్పటికే ఆయా పాఠశాలలకు పంపించామని తెలిపారు. సోమవారం 8, 9, 10వ తరగతి పుస్తకాలు రానున్నాయని తెలిపారు. వీటిని కూడా మరో రెండు రోజుల్లో ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రతి పాఠశాల హెడ్మాస్టర్ తమ పాఠశాలకు పుస్తకాలు వచ్చిన వెంటనే విద్యార్థులకు తప్పక అందజేయాలని ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి ఫిర్యాదు అందరాదని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పట్టణంలోని గుట్టకిందపల్లి మోడల్ స్కూల్, మోటుమర్ల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయలో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేసేందుకు అనుమతి వచ్చిందని తెలిపారు. ఈ రెండు పాఠశాలల్లో విద్యార్థులకు మంచి అవకాశం లభించడం శుభదాయకమని తెలిపారు. సీబీఎస్ఈ సిలబస్ ద్వారా విద్యార్థులు విద్యలో మరింతగా రాణించే అవకాశం ఉందని తెలిపారు. సీబీఎస్ఈ సిలబస్ 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ వర్తిస్తుందని తెలిపారు. కాగా తమ పాఠశాలలకు సీబీఎస్ఈ సిలబస్ రావడం పట్ల మోడల్ స్కూల్, కేజీవీబీ ప్రిన్సిపల్స్ సంతోషం వ్యక్తం చేశారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఎస్ఐ కె.వీరేష్

ప్రజాశక్తి-అగళి

మండలంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని, ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కె.వీరేష్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఎస్ఐ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ప్రశాంతంగా ఉండాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ నెల 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్ట్యా గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా ఉంటూ అందరూ సహకరించాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజు, ఫలితాల తర్వాత కూడా గ్రామాల్లో అందరూ కలిసిమెలసి ఉంటూ ప్రశాంతంగా మెలగాలని సూచించారు. మండలం అంతటా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టు ఆంక్షలు అమలులో ఉన్నాయని, కావున ఎక్కడా నలుగురి కంటే ఎక్కువ మంది ఒక చోట గుమిగూడరాదన్నారు. పోలీసుల ముందస్తు అనుమతి లేనిదే ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదన్నారు. విజయోత్సవ ర్యాలీలు నిషేధమని తెలిపారు. పెట్రోల్ బంకుల్లో, గ్రామాల్లోని దుకాణాల్లో విడిగా బాటిళ్లు, క్యాన్లలో పెట్రోల్, డీజిల్ అమ్మడం నిషేధమని తెలిపారు. కౌంటింగ్ రోజు వరకే కాకుండా ఆ తర్వాత కూడా ప్రశాంతంగా మెలుగుతూ పోలీసులతో సహకరించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.